క్లుప్తంగా

ఘనంగా విగ్రహ ప్రతిష్ట

వేముల : మండలంలోని చింతలజూటూరు గ్రామంలో మెయిళ్లచెరువు గంగమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ట వేడుకలు శనివారం గంగమ్మ అమ్మవారిని వేద పండితులు మంత్రోచ్చరణల మధ్య ప్రతిష్టించారు. అలాగే అమ్మవారి ఎదురుగా ధ్వజస్తంభాన్ని ప్రతిష్టించారు. అనంతరం భక్తులు, మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిష్ట సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రేషన్ పంపిణీపై నిరంతర పర్యవేక్షణ

జమ్మలమడుగు : పట్టణ, మండల పరిధిలో ప్రజా పంపిణీ వ్యవస్థ సక్రమంగా జరుగుతుందో లేదో అన్న దానిపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని తహసీల్దార్ గురప్ప తెలిపారు. శనివారం పట్టణంలోని వివిధ ప్రాంతాలలో వాహనాల ద్వారా పంపిణీ చేస్తున్న రేషన్‌ను ఆయన పరిశీలించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్క రేషన్ కార్డుదారునికి నిత్యావసర వస్తువులను అందించే బాధ్యత రేషన్ డీలర్లదే అని సూచించారు.

క్రీడా కిట్లు పంపిణీ

చెన్నూరు : ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా వివిధ క్రీడలలో విజేతలుగా నిలిచిన టీం సభ్యులకు మండల వైఎస్సార్ సీపీ నాయకులు, జీఎస్ భాస్కర్‌రెడ్డి, టౌన్ కన్వీనర్ ముదిరెడ్డి సుబ్బారెడ్డి శనివారం క్రీడా సామగ్రిని, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సిద్దిగారి వెంకటసుబ్బయ్య, పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి, వెటర్నటీ డాక్టర్ ఉపేంద్ర, సాగర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆర్టీపీపీలో ఉద్యోగుల ధర్నా

ఎర్రగుంట్ల : డాక్టర్ ఎంవీఆర్ ఆర్టీపీపీలో పనిచేస్తున్న ఉద్యోగులు శనివారం పవర్ హౌస్ మెయిన్ గేటు వద్ద అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వేతనాలు ఉద్యోగుల ఖాతాలలో జమ కాకపోవడంతో ధర్నా చేశారు. సోమవారం నుంచి ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్మిక ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న కమిషనర్ పి.జగన్నాథ్

ఎర్రగుంట్ల : పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు వివరించి వారికి అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్ తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన మెప్మా ఆర్పీలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి వర్గానికి సంక్షేమ పథకాలు అందేల చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కార్యక్రమంలో మెప్మా సీఓ వసంత్‌రెడ్డి, ఆర్పీలు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

హాకీ జాతీయ జట్టుకు శ్రీవిద్యాధరి విద్యార్థిని

పులివెందుల టౌన్ : పులివెందుల శ్రీవిద్యాధరి స్కూలులో 9వ తరగతి చదువుతున్న చిన్నారి శాంకరి మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ నగరంలో స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గతనెల 31వ తేదీ నుంచి ఈనెల 3వ తేదీ వరకు జరిగిన అంతర్ రాష్ట్రీయ అండర్-14 బాలికల హాకీ టోర్నమెంట్‌లో రాష్ట్ర జట్టు తరపున పాల్గొని మంచి ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి జట్టుకు ఎంపికైందని ఆ పాఠశాల సీఈఓ భానుప్రకాష్, కరస్పాండెంట్ నాగరాజులు తెలిపారు. తమ విద్యార్థి ప్రతిభపట్ల పాఠశాల ప్రిన్సిపాల్ జాకీర్ హుస్సేన్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

అధ్యాపకుల సమస్యలను పరిష్కరించండి

వేంపల్లె : ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో పనిచేస్తున్న పర్మినెంట్ అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి డైరెక్టర్ కుమారస్వామి గుప్తా కృషి చేయాలని నూతన అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ అమరేంద్ర కుమార్ సండ్ర కోరారు. శనివారం నూతనంగా ఏర్పాటు చేసుకున్న అసోసియేషన్ సభ్యులతో కలిసి ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌కే వ్యాలీ ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. ఇదివరకు ఎప్పుడూ కూడా అసోసియేషన్ లేదని.. ప్రస్తుతం నూతనంగా అసోసియేషన్ ఏర్పాటు చేశామన్నారు. అందుకు ఒక గదిని ఏర్పాటు చేయాలని కోరారు. అధ్యాపకుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అందుకు డైరెక్టర్ సానుకూలంగా స్పందించి త్వరలోనే సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నూతన అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవికుమార్, కోశాధికారి వెంకటేష్, కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొని డైరెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్మా చట్టాన్ని ఎత్తివేయాలి

కమలాపురం : తమ సమస్యల సాధనకై సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ప్రభుత్వం విధించిన ఎస్మా చట్టాన్ని ఎత్తి వేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనువాసులురెడ్డి, ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి చంద్రశేఖర్‌లు డిమాండ్ చేశారు.

పులివెందుల అరటికి విదేశాల్లో భలే గిరాకీ

- నియోజకర్గంలో అధిక విస్తీర్ణంలో అరటి పంట
- రూ.16 కోట్లతో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు



అరటి గెలలను ఎగుమతి చేస్తున్న కూలీలు

పులివెందుల రూరల్ : నియోజకవర్గంలో పండిస్తున్న అరటికి చాలా ప్రత్యేకతే కాక విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. దేశంలోనే అరటిని ఎక్కువగా పండించే ప్రాంతంలో పులివెందుల మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లె, కొత్తపల్లె, ఎర్రబల్లె గ్రామాలతోపాటు లింగాల, తొండూరు, వేముల మండలాల్లో రైతులు అరటి పంటను అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. రవాణాలో ఆలస్యం జరిగినా అరటి కాయలు దెబ్బతినే అవకాశం ఉండకుండా కాయలను భద్రపరుస్తారు. మహారాష్ట్ర వ్యాపారులు పులివెందులలో డిసెంబర్ నుంచి ఫిబ్రవరి వరకు ఈ ప్రాంతాల్లోనే మకాం వేసి కొనుగోలు చేసిన అరటి కాయలను గల్ఫ్ దేశాలకు ఎగుమతి చేస్తారు. వ్యాపారులు కొనుగోలు చేసిన పంటను వాహనాల ద్వారా ముంబైకి తరలించి అక్కడి నుంచి ఓడల ద్వారా గల్ఫ్ దేశాలకు తరలిస్తారు. మరికొందరు వ్యాపారులు శ్రీనగర్, పంజాబ్ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 30వేల హెక్టార్లల్లో అరటి సాగు చేస్తున్నారు. పులివెందుల మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లె గ్రామానికి వెళ్లే రోడ్డు సమీపంలో రూ.16 కోట్లతో 2 వేల టన్నుల అరటి కాయలు నిల్వ ఉంచే విధంగా అరటి కోల్డ్ స్టోరేజ్‌ను ఏర్పాటు చేశారు. ఈ కోల్డ్ స్టోరేజ్‌ను రెండు నెలల క్రితం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డిలు ప్రారంభించారు. రైతులు పండించిన తమ పంటలను కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వ ఉంచుకుని రేట్లు అధికంగా వచ్చినప్పుడు అమ్ముకునే విధంగా ఇక్కడ కోల్డ్ స్టోరేజ్‌ను ఏర్పాటు చేశారు. దీనిపై ఈ ప్రాంత రైతులు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్ అరటి ధరలు టన్ను రూ.15వేల నుంచి రూ.18వేల వరకు ఉన్నట్లు రైతులు అంటున్నారు.

విదేశాలకు ఎగుమతి కావడం ఆనందంగా ఉంది



పులివెందుల ప్రాంతంలోని నల్లపురెడ్డిపల్లె గ్రామంలో పండించే అరటి విదేశాలకు ఎగుమతి చేయడం చాలా ఆనందంగా ఉంది. నల్లపురెడ్డిపల్లె గ్రామంలో పండించే అరటికి ఒక ప్రత్యేకత కూడా ఉంది. అందువల్ల ప్రతి రైతు తనకున్న పొలంలో అరటిని సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కూడా అరటి ధరలు ఆశాజనకంగా ఉన్నాయి.

– ఉమ్మారెడ్డి(అరటి రైతు), నల్లపురెడ్డిపల్లె, పులివెందుల

ఇతర రాష్ట్రాలలో కూడా భలే గిరాకీ



పులివెందుల నియోజకవర్గంలో పండించే అరటికి ఇరత రాష్ట్రాలలో కూడా మంచి గిరాకీ ఉంది. ఇక్కడ వ్యాపారులు కూడా ఈ ప్రాంతంలో పండించే అరటిని ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. అరటి ధరలు కూడా బాగానే ఉన్నాయి. నల్లపురెడ్డి పల్లె, ఎర్రబల్లె, కొత్తపల్లె గ్రామాల్లో పండించే అరటిని గల్ఫ్ దేశాలకు ఎగుమతి చేస్తున్నారు.

– రామమల్లేశ్వరరెడ్డి(అరటి రైతు), నల్లపురెడ్డిపల్లె, పులివెందుల

ఆలయ పునఃనిర్మాణానికి భూమిపూజ



ఆంజనేయస్వామి ఆలయ పునఃనిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల : పులివెందులలో శనివారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. శనివారం ఉదయం పట్టణంలోని ముద్దనూరు రోడ్డులోని ఆంజనేయస్వామి గుడి పునఃనిర్మాణానికి ఇటీవలే ప్రభుత్వం దేవాదాయ శాఖ ద్వారా కోటి రూపాయల నిధులు మంజూరు చేసింది. అందుకు సంబంధించి ఆయన మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డిలతో కలిసి ఆలయ పునఃనిర్మాణానికి అర్చకుల వేద మంత్రోచ్చరణల మధ్య భూమి పూజ చేశారు. అనంతరం ఆయన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాచమల్లు రవిశంకర్‌రెడ్డి ఏర్పాటు చేసిన నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించి మాట్లాడారు. క్యాలెండర్లు ప్రభుత్వ పథకాలు ప్రతిబింబేలా రూపొందించినందుకు రాచమల్లు రవిశంకర్‌రెడ్డిని అభినందించారు. అనంతరం ఆయన పార్నపల్లె రోడ్డులోని లింగాల మండల నాయకులు జలంధర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డిలు నూతనంగా ఏర్పాటు చేసిన ఫర్టిలైజర్ షాపును ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వివాహ వేడుకలో ఎంపీ దంపతులు

పులివెందుల : తన సమీప బంధువులైన ఇసీ గంగిరెడ్డి మేనకోడలు తులశమ్మ, ఎద్దుల విష్ణుకుమార్‌రెడ్డిల కుమారుడు డాక్టర్ జగదీశ్వరరెడ్డి, డాక్టర్ లక్ష్మీప్రియల వివాహ వేడుకలకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, సతీమణి సమతమ్మలు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వీరితోపాటు పలువురు వైఎస్ కుటుంబీకులు నూతన వధూవరులను ఆశీర్వదించారు.



పులివెందులలో.. నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న అవినాష్‌రెడ్డి దంపతులు

రైతు సంక్షేమమే జగనన్న ధ్యేయం



విద్యుత్ సబ్‌స్టేషన్ పనులను పరిశీలిస్తున్న వైఎస్ కొండారెడ్డి

చక్రాయపేట : రైతు సంక్షేమం కోసం జగనన్న ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందని వైఎస్ ఆర్‌సీపీ చక్రాయపేట మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డి తెలిపారు. శనివారం ఆయన మండలంలోని చిలేకాంపల్లెలో నూతనంగా నిర్మిస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్ పనులను పరిశీలించి అక్కడికి వచ్చిన రైతులతో మాట్లాడారు. జగనన్న రైతులకు నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలన్న లక్ష్యంతో విద్యుత్ సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేయిస్తున్నాడన్నారు. ఇప్పటికే జగనన్న ప్రభుత్వంలో ఎర్రగుడి, సిద్దారెడ్డిపల్లె, మహదేవపల్లె గ్రామాల్లో సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేసి రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను ఇస్తున్నట్లు తెలిపారు. చిలేకాంపల్లె సబ్‌స్టేషన్ కూడా మరో 20 రోజుల్లో ప్రారంభించేలా పనులను త్వరిత గతిన చేయిస్తున్నామన్నారు. వీటివల్ల నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కూడా లభిస్తాయన్నారు. అనంతరం ఆయన చిలేకాపల్లెలో అనారోగ్యంతో బాధపడుతున్న దేశాయి రామలింగారెడ్డిని పరామర్శించారు. కార్యక్రమంలో మండల సమన్వయకర్త ఓబుళరెడ్డి, సర్పంచులు కిరణ్‌కుమార్‌రెడ్డి, ఉత్తయ్య, మండల జేసీఎస్ కన్వీనర్ రామాంజులరెడ్డి, పార్టీ నేతలు హరినాథరెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి, సురేష్, చిదంబరరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యుడు గౌస్‌లాదం తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ఆణిముత్యాలను దేశానికి అందిస్తాం



క్రీడాకారులకు క్రీడా సామగ్రిని పంపిణీ చేస్తున్న మండల కన్వీనర్, ఎంపీపీ, తదితరులు

వేంపల్లె : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసి దేశానికి అందించాలనే గొప్ప సంకల్పంతో సీఎం వైఎస్ జగన్ ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ప్రారంభించారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చంద్రఓబుళరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గ్రామస్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులకు క్రీడా సామగ్రి కిట్లను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. గ్రామీణస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు వివిధ దశల్లో క్రీడా పోటీలను నిర్వహిస్తోందన్నారు. గ్రామాల్లోని ఆణిముత్యాలను గుర్తించి సచివాలయ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో ప్రసిద్ధి గాంచిన వివిధ క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతోందన్నారు. సచివాలయస్థాయి నుంచి క్రీడా సామగ్రి కిట్లు పంపిణీ చేస్తున్నామని.. సచివాలయ, మండలస్థాయిల నుంచి గెలుపొందిన వారికి నియోజకవర్గస్థాయిలో ఆడేందుకు ప్రొఫెషనల్ కిట్లు పంపిణీ చేస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.లక్ష్మీగాయత్రి, మండల ఉపాధ్యక్షుడు బాబా షరీఫ్, మండల స్పెషలాఫీసర్ రవీంద్రనాథరెడ్డి, ఎంపీడీఓ దివిజ సంపతి, ఈఓపీఆర్డీ మల్లికార్జునరెడ్డి, పీడీ రాజశేఖర్, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వికసిత భారత్ సంకల్ప యాత్రలు

సింహాద్రిపురం : మండలంలోని కసనూరు, దిద్దేకుంట్ల గ్రామాల్లో శనివారం వికసిత భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎవరైనా అర్హత ఉండి లబ్ధి పొందని వారికి ఆ పథకాల ద్వారా ప్రయోజనం పొందేందుకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ రాష్ట్ర మెంబర్ శివప్రసాద్‌రెడ్డి, ఈఓపీఆర్డీ పద్మనాభరెడ్డి, డాక్టర్ ప్రత్యూష, కసనూరు సర్పంచ్ రమణమ్మ, దిద్దేకుంట్ల సర్పంచ్ ప్రహ్లాదారెడ్డి, వెలుగు సీసీలు, బ్యాంక్ అధికారులు, పంచాయతీ సెక్రటరీ అరుణ్, బీజేపీ నాయకులు శ్రీనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతాంగ వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

ఎర్రగుంట్ల : ఎన్నికల ముందు పాలక ప్రభుత్వాలు అవలంభిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జీ ఈశ్వరయ్య తెలిపారు. శనివారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన 19వ జిల్లా మహాసభల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అప్పుల ఊబిలో కూరుకుపోతున్న రైతులు ఆత్మహత్యలను అరికట్టాలంటే పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, వ్యవసాయ రుణాలను మాఫీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యాక్షుడు కాటమయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

బంగారు కొండలు

జేఎన్‌టీయూ (ఏ) వీసీ రంగ జనార్దన చేతుల మీదుగా బంగారు పతకాలు అందుకున్న వారు

అనంతపురం : జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం-జేఎన్‌టీయూ(ఏ) 13వ స్నాతకోత్సవం శనివారం అట్టహాసంగా జరిగింది. యూనివర్సిటీ ఆడిటోరియంలో కట్టుదిట్టమైన భద్రతా పర్యవేక్షణలో జరిగిన వేడుకలో యూనివర్సిటీ చాన్సలర్/రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు పతకాలు, పట్టాలు అందించారు.



ఎం. సాయి ఉపేంద్ర రెడ్డి (కడప)



బిజివేముల చంద్ర ప్రకాష్ రెడ్డి, (పులివెందుల)



సోమల జగదీశ్వర రెడ్డి (పులివెందుల)



సి పెంచల లక్ష్మీ సుష్మ (పులివెందుల)



పాలగాటి రాజమోహన్ రెడ్డి (పులివెందుల)



చింతా గోవర్ధన్ (పులివెందుల)



పోతిరెడ్డి విష్ణుప్రియ (పులివెందుల)



పి. సంగీత (పులివెందుల)



రాయలం జయశ్రీ (పులివెందుల)

నేడు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నెముక, నరాలు, తిమ్మిర్లు, వంటి, ఒళ్లు నొప్పుల కు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. అలాగే కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె జబ్బుల సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ హరిత సరిగా నిద్ర లేకపోవడం, ముందులాగా పనిచేయలేకపోవడం, తలనొప్పి, ఆందోళనగా ఉండటం, టెన్షన్, దడ, చమటలు పట్టడం, భయంగా ఉండటం, ఆలోచనలు అదుపులో లేకపోవడం, మతి మరుపు, కుటుంబ కలహాలు, లైంగిక సమస్యలు తదితర సమస్యలకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

క్యాలండర్‌ను విడుదల

జమ్మలమడుగు : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొత్త సంవత్సరం క్యాలండర్‌ను ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి శనివారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో విడుదల చేసి మాట్లాడారు. జనవిజ్ఞాన వేదిక ద్వార ప్రజల్లో ఉన్న మూఢ విశ్వాసాలపై అవగాహనకల్పించాలని సూచించారు.

రేపు కల్యాణ మండపం నిర్మాణానికి భూమిపూజ

వీరపునాయునిపల్లె : మండలంలోని సంగమేశ్వరాలయం ప్రాంగణంలో సోమవారం ఉదయం 10 గంటలకు కల్యాణ మండపం నిర్మాణానికి ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి భూమిపూజ చేస్తారని ఆలయ చైర్మన్ నరెడ్డి శివాంజనేయరెడ్డి తెలిపారు. ఈ కల్యాణ మండపానికి ఎమ్మెల్యే తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులతో చర్చించగా ఆలయం తరపున రూ.40 లక్షలు డిపాజిట్ చేస్తే రూ.2 కోట్ల వ్యయంతో కల్యాణ మండపం నిర్మిస్తామని టీటీడీ అధికారులు సూచించారు. కడప పట్టణంలోని షిర్డీ సాయి ఎలక్ట్రికల్ ఎండీ విశ్వేర్‌రెడ్డి రూ.40 లక్షలు చెల్లించేందుకు ముందుకు వచ్చారు. సోమవారం నిర్వహించే భూమిపూజలో విశ్వేర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి తదితరులు పాల్గొంటారన్నారు. మండల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కష్టమైన సబ్జెక్ట్‌ను ఇష్టంగా చదవాలి

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : విద్యార్థులు కష్టమైన సబ్జెక్ట్‌ను ఇష్టంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని దొమ్మరనంద్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.పి.వి. సుబ్బారెడ్డి తెలిపారు. శనివారం మైలవరం మండలం దొమ్మరనంద్యాల గ్రామంలో ఉన్న బీసీ బాలుర హస్టల్‌లో విద్యార్థులకు శిక్షణ, ప్రేరణ తరగతులను ఆయన నిర్వహించి మాట్లాడారు. 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ముందుగా నిర్ణయించుకున్న ప్రకారం ఉపాధ్యాయులు చెప్పిన వాటిని చదువుకుంటే మంచి ఉత్తీర్ణత సాధించవచ్చునన్నారు. పరీక్ష హాలులోకి వెళ్లిన తరువాత ప్రశ్న పత్రాన్ని ఒకటికి రెండు సార్లు చదివితే అర్థం అవుతుందన్నారు. అనంతరం సబ్జెక్ట్ ప్రకారం ఉపాధ్యాయులు సూచనలు సలహాలు అందించారు. అనంతరం వారు విద్యార్థులకు మెటీరియల్‌ను అందజేశారు. వసతి గృహ సంక్షేమ అధికారి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమ పథకాల వెల్లువ



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు చేరుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని 10వ వార్డులో ఆయన మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డితో కలసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అమలుపై ప్రజలతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రతి గడపకూ తెలియాల్సిన అవసరం ఉందన్నారు. వలంటీర్లు సహకారంతో సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిపై ప్రజలకు తెలపాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఆదాయం అంతా పెత్తందారులు, బడాబాబుల చేతుల్లోకి ఎందుకు వెళ్లిపోయిందో తెలియజేస్తామన్నారు. ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ రామాంజనేయులు, డీలర్ అసోసియేషన్ నాయకులు మహమ్మద్ రఫీ, చిన్నయ్య, గడికోట రషీద్, జూవారి ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు మురళీక్రిష్ణ, మైనార్టీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : మైలవరం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో శనివారం లబిదారులకు పింఛన్లను ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి అందజేసి మాట్లాడారు. అవ్వ, తాతలకు ఇచ్చిన హామీ మేరకు రూ.3 వేలు పెంచిన పింఛన్లను తెల్లవారు జామున వలంటీర్లు తలుపుతట్టి అందజేస్తున్నారన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ సభ్యులు సూచించిన వారికే పింఛన్ లభించేదన్నారు. జగనన్న ప్రభుత్వంలో అర్హులైన వారు దరఖాస్తు చేసుకుంటే పార్టీలకు అతీతంగా మంజూరు చేస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 66.34 లక్షల మందికి పింఛన్ అందిస్తున్నామన్నారు. మేలు చేసిన జగనన్నను మరువ వద్దని ప్రజలను కోరారు. ఎంపీపీ చేరెడ్డి సావిత్రి, జడ్పీటీసీ మహాలక్ష్మీ, ఎంపీటీసీ బాలకొండయ్య, మార్కెట్ యార్ట్ చైర్మన్, వైస్ చైర్మన్ రమణారెడ్డి, సుబ్బరాయుడు, సర్పంచ్ సోనుభాయి, మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వరరెడ్డి, గుర్విరెడ్డి, చేరెడ్డి చెన్నకేశవరెడ్డి, రాఘవరెడ్డి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి 30 కుటుంబాలు చేరిక

ఎర్రగుంట్ల : పట్టణంలోని 10వ వార్డుకు చెందిన బాలకృష్ణారెడ్డి, ప్రతాప్‌రెడ్డిలతో కలిపి 30 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి శనివారం చేరారు. వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారికి ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డిలు వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



పత్ర కుల సంక్షేమ సంఘ తాలుకా నూతన కార్యవర్గం

పులివెందుల : పత్ర కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని వేముల ఎంపీపీ చల్లా గంగాదేవి, వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటనారాయణ, పత్ర సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చల్లా సునీల్‌కుమార్‌లు కోరారు. శనివారం పట్టణంలోని స్థానిక ఎస్‌సీఎస్‌ఆర్ కల్యాణ మండపంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని వారు కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది నవంబర్ 10వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించామని.. సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. మీరు చొరవ చూపి తమ పత్ర కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల జనాభా పత్ర కులస్తులం కలిగి ఉన్నామని.. కానీ ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయలేదన్నారు. స్పందించిన ఎంపీ త్వరలో విజయవాడలో సీఎం క్యాంపు కార్యాలయంలో పత్ర కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్‌పై చర్చించి కార్పొరేషన్ ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానన్నారు. వారి వెంట పత్ర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతురాయుడు, గౌరవాధ్యక్షుడు చిన్న ఆంజనేయులు, పత్ర కులస్తులు ఉన్నారు.

పత్ర కుల సంక్షేమం కోసం కృషి

పులివెందుల రూరల్ : పత్ర కుల సంక్షేమం కోసం తనవంతు కృషి చేస్తానని పత్ర సంక్షేమ సంఘ నూతన అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం పట్టణంలోని ఎస్ఎస్ ఫంక్షన్ హాలులో పత్ర కుల సంక్షేమం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పత్ర కులస్తులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పత్ర కుల సంక్షేమ సంఘ తాలుకా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పత్రకుల సంక్షేమ సంఘ తాలుకా అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పత్ర కులస్తులలో ఏవైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకరావాలన్నారు. రాష్ట్రంలో పత్ర కులస్తులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నూతన కమిటీ సభ్యులు అధ్యక్షుడు లక్ష్మీనారాయణను పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో పత్రకుల రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విజయ్‌కుమార్, పత్ర కుల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బ్యాంకర్లు పనితెలిసిన అప్రైజర్లను నియమించుకోవాలి

పులివెందుల టౌన్ : నియోజకవర్గ వ్యాప్తంగా బ్యాంకర్లు తమ బ్యాంకులలో అప్రైజర్ల(బంగారు తనిఖీ చేసేవారు)ను పనితెలిసిన వారిని పెట్టుకోవాలని బంగారు అంగళ్ల సంఘ అధ్యక్షుడు పట్టాభి రామయ్య, ఉపాధ్యక్షుడు దక్షిణా మూర్తిలు తెలిపారు.

శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఒరిజినల్ బంగారు కూడా ఇత్తడి బంగారం అని అప్రైజర్ చెప్పడంతో ఒక ఖాతాదారుడి తక్షణమే డబ్బు కట్టాలని బ్యాంకర్లు ఆదేశించడం ఏమిటని వారు ప్రశ్నించారు. రెండేళ్లుగా అదే బంగారాన్ని బ్యాంకులో తనక పెడితే డబ్బులు ఇచ్చిన బ్యాంకర్లు ఆడిట్ సమయంలో అప్రైజర్ బంగారం సరిగా లేదని అని చెప్పడంతో ఖాతాదారుని బ్యాంకర్లు ఇబ్బంది పెట్టి డబ్బు కట్టించుకోవడం ఏమిటని వారు ప్రశ్నించారు. ఆ ఖాతాదారుడు బంగారు అంగడి యజమానిని నిలదీయడంతో వెంటనే బ్యాంక్ వద్దకు వెళ్లి ఇది సరైన బంగారం అని చెప్పి అక్కడ బంగారు పరీక్షలు నిర్వహించి ఒరిజనల్ బంగారం అని నిరూపించడం జరిగిందన్నారు.

